ఘనంగా బీర్షాముండా జయంతి

బీర్షాముండా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, నవంబర్ 15 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బీర్షాముండా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీసీడీవో రజిత, ప్రత్యేకాధికారి పద్మ, సీపీవో రాజారామ్, డిస్ట్రిక్ట్ ఫిషరీష్ ఆఫీసర్ శ్రీపతి, డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, టీజీవో సెక్రటరీ సాయిరెడ్డి, గిరిజన శాఖ సిబ్బంది, గిరిజన నాయకులు హాజరయ్యారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

బాన్సువాడ టౌన్, నవంబర్ 15 : పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ గంగాధర్‌ను బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనం గంగాధర్, బాన్సువాడ బీసీ సంఘ సభ్యులు శుక్రవారం సన్మానించారు.

ట్రాక్టర్ ఢీ.. ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, నవంబర్15: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శివారులో యానంగుట్ట సమీపంలో శుక్రవారం సాయం త్రం ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందా రు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. సోలం గంగాధర్(35) కొన్ని నెలల క్రితం నుంచి జక్రాన్‌పల్లి మండలం కేశ్‌పల్లి గ్రామంలో ఉంటున్నాడు. ఆర్మూర్‌లో తన పని ముగించుకొని కేశ్‌పల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. యానంగుట్ట ఎక్స్ రోడ్డు వద్ద ఓ ట్రాక్టర్ బైక్‌ను వెనుక నుంచి ఢీ కొంది. బైక్‌పై సోలం గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నస్రుల్లాబాద్, నవంబర్ 15 : బీర్కూర్‌కు చెందిన కుర్రి నారాయణ(40) బీర్కూర్ గ్రామ శివారులోని నల్‌చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ ఈ నెల 10వ తేదీన మద్యం తాగి తన భార్య స్వరూపతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. 13వ తేదీన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం మృతదేహం లభించిందన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు కార్ల ఉచిత చెక్‌ప్ శిబిరం

ఖలీల్‌వాడి, నవంబర్ 15 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని హుందాయ్ షోరూంలో ఆదివారం కార్ల ఉచిత చెకప్ నిర్వహించనున్నట్లు మేనేజర్ వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయత్రం 6 గంటల వరకు హుందాయ్ కార్లను చెకప్ చేస్తామని పేర్కొన్నారు. కొత్త కార్ల ప్రదర్శన, టెస్ట్ డ్రైవింగ్, పాతకార్ల వాల్యూషన్ నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

తరచూ ప్రమాదాలు.. ధ్వంసమవుతున్న డివైడర్లు

- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

మాచారెడ్డి, నవంబర్ 15 : తరచూ ప్రమాదాలు జరుగుతూ డివైడర్లు ధ్వంసమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మాచారెడ్డి జడ్పీహెచ్ఎస్ నుంచి ఘన్‌పూర్ స్టేజీ వరకు దాదాపు 2 కి.మీ డబుల్ రోడ్డును ఫోర్ వే లైన్‌గా మార్చి డివైడర్‌ను గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. మూడు నెలల క్రితం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద ఓమిని వ్యాన్ డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. కానీ.. డివైడర్ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఎక్స్‌రోడ్‌లోని అక్కాపూర్‌కు వెళ్లే మార్గంలో నెల రోజుల క్రితం ఓ లారీ వెనుక భాగం డివైడర్‌కు తగలడంతో డివైడర్ ధ్వంసమైంది. డివైడర్లు నిర్మించి కనీసం ఏడాది గడువక ముందే ఇలా ధ్వంసం కావడంపై ఆయా గ్రామాల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకొని వెంటనే డివైడర్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కూలిన డివైడర్ నిర్మాణాలు

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

కేసీఆర్ చొరవతో రూ. కోటితో బాన్సువాడలో అంబేద్కర్ భవన నిర్మాణం

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాసుల బాలరాజు, పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్, నవంబర్ 15 : బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజారాం దుబ్బలోని బుడగ జంగం కాలనీలు శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, దళిత నాయకులతో కలిసి డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో బాన్సువాడలో రూ. కోటితో అత్యాధునిక హంగులతో అంబేద్కర్ భవనాన్ని నిర్మించామని డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, దళిత సంఘం నాయకులు మైశయ్య, నెర్రె నర్సింహులు, అయ్యాల సంతోష్, అంజయ్య, ప్రశాంత్ కుమార్, కుమ్మరి రాజు, నాయకులు ఎజాస్, గోపాల్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల్లో శిక్షణ

కామారెడ్డి రూరల్, నవంబర్ 15 : కామారెడ్డి మండలం దేవునిపల్లి అక్షయ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో 30 మంది విద్యార్థులు ఉంటే ఉచితంగా టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ డిజైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ భూపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 29 ఏండ్లు ఉండి ఇంటర్ పాసై ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7416713338, 9949173338 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపిక

మహేశ్ | అఖిల్‌గౌడ్ | యాదగిరి

మాచారెడ్డి/లింగంపేట, నవంబర్ 15 : పాల్వంచ మండలంలో ఇద్దరు గ్రూప్-4కు ఎంపికయ్యారు. మండలంలోని మంథనిదేవునిపల్లికి చెందిన మంగలి మహేశ్ అనే యువకుడు గ్రూప్-4 ఎంపికయ్యాడు. గ్రామంలో మొట్టమొదటి ప్రభుత్వ ఉద్యోగం సాధించి రికార్డు సాధించాడు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అరవింద్ సత్కరించారు. భవానీపేట గ్రామంలో ఆశన్నగారి రమేశ్ కుమారుడు అఖిల్‌గౌడ్ గ్రూప్-4కు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. లింగంపేటకు చెందిన దాసరి యాదగిరి గ్రూప్-4లో ఉద్యోగం సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

లింగంపేటకు చెందిన దాసరి గోపి కుమారుడు యాదగిరి గ్రూప్-4 ఫలితాల్లో సత్తా చాటి పబ్లిక్ హెల్త్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. దీంతో అతడిని కుటుంబీకులతోపాటు స్థానికులు అభినందించారు.

ప్రమాదవశాత్తు బావిలో జారిపడి రైతు మృతి

రాజంపేట్, నవంబర్ 15 : రాజంపేట మండలం పెద్దాయిపల్లి గ్రామంలో వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు జారిపడి రైతు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాయిపల్లి గ్రామానికి చెందిన కామిశెట్టి రవీందర్(51) రోజులాగే వ్యవసాయ పనుల కోసం గురువారం తన భార్య రాణితో కలిసి బీర్నీసు పంటకు పురుగు మందు కొట్టడానికి వెళ్లారు. కరెంటు లేకపోవడంతో వ్యవసాయ బావిలోకి దిగి బకెట్టుతో నీళ్లు ముంచుతుండగా ప్రమాదవశాత్తు జారిపడిపోవడంతో ఈత రాక నీటిలో మునిగిపోయాడు.

భార్య అరుపులతో స్థానికులు చేరుకొని బయటికి తీసే ప్రయత్నం చేశారు. కానీ బావిలో నీళ్లు ఎక్కువగా ఉండడంతో వీలు కాలేదని, పోలీసులకు సమాచారం అందించడంతో రాత్రి గజ ఈతగాళ్ల సహాయంతో బయటికి తీయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో పడి ఒకరు..

మద్నూర్, నవంబర్ 15: డోంగ్లీ మండలం పెద్దటాక్లీ గ్రామానికి చెందిన సురేశ్(36) ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందినట్లు ఎస్సై విజయ్‌కొండ శుక్రవారం తెలిపారు. సురేశ్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న వాగు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన బీర్కూర్ ఏఎంసీ పాలకవర్గ సభ్యులు
– నస్రుల్లాబాద్, నవంబర్ 15

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

బుక్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి

కామారెడ్డి, నవంబర్ 15 : జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుక్ ఎగ్జిబిషన్‌ను జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య దశలోనే గ్రంథాలయాలను వినియోగించుకునే అలవాటు పెంపొందించుకొని తమ భవిష్యత్తు ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

నియామకపత్రాన్ని అందజేస్తున్న మాల సంఘం రాష్ట్ర నాయకుడు అయ్యల సంతోష్

కామారెడ్డి, నవంబర్ 15 : జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం మాల సంఘం రాష్ట్ర నాయకుడు అయ్యల సంతోష్ ఆధ్వర్యంలో మాల సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా సంకి రతన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా నీరెడ్డి మైసయ్య, కోశాధికారిగా మైండ్ల ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా కప్ప సత్యం, సిద్దార్థ్ రాజ్, పతంగి పెద్ద సాయిలు, లక్ష్మణ్, నరేశ్ ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర నాయకుడు అయ్యల సంతోష్ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సాయిలు, సాయిబాబా, పాపయ్య, సాయలు, రాజు, నరేశ్, మైషయ్య, కాశీరం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

శబరిమాత ఆశ్రమంలో పూజ చేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

పిట్లం అయ్యప్ప ఆలయం, ఎల్లారెడ్డిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పెద్దకొడప్‌గల్‌లోని పాపహరేశ్వర శివాలయంలో..

ఎల్లారెడ్డి రూరల్/ లింగంపేట/ పెద్దకొడప్‌గల్/ రామారెడ్డి/ కామారెడ్డి/ నస్రుల్లాబాద్/ బీబీపేట్/రాజంపేట్, నవంబర్ 15: జిల్లాప్రజలు కార్తీక పౌర్ణమి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఇండ్లలో ఉన్న తులసి చెట్లకు లగ్గాలు చేశారు. తులిసి చెట్టు, కృష్ణుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. 365 వత్తులను కాల్చారు. మంగళహారతులు ఇచ్చి, తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

కామారెడ్డిలోని ఓంకారేశ్వరాలయంలో వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఇష్టకార్య సిద్ధి హనుమాన్ ఆలయంలో జ్వాలతోరణం

తాడ్వాయి మండలంలోని బ్రహ్మజీవాడి గ్రామంలో నిర్వహించిన కార్తీక పౌర్ణమి ఉత్సవాల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. అనంతరం తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. రామారెడ్డి మండలంలోని అన్ని గ్రామాల్లో కార్తీక పౌర్ణమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. రామారెడ్డిలోని శివాలయం, రామాలయం, కాలభైరవస్వామి ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించడంతోపాటు ఉసిరి దీపాలు బ్రాహ్మణులకు దానం చేశారు.

పెద్దకొడప్‌గల్ మండలంలోని పాపహరేశ్వరాలయం, పిట్లంలోని అయ్యప్ప ఆలయాల్లో కార్తీక దీపోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయాలు దీప కాంతులతో వెలిగిపోయాయి. ఓంకార నాదాలు, వేద మంత్రాలు, శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి.

కామారెడ్డిలోని ఆర్‌బీ నగర్‌లో ఉన్న ఇష్టకార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయం, విద్యానగర్‌లోని శివాలయం, జయశంకర్ భవాని నగర్ కాలనీలోని ఓంకారేశ్వర ఆలయంలో శుక్రవారం కార్తీక మాసం సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆయా ఆలయాలలో మహిళలు దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. బీబీపేటతోపాటు నస్రుల్లాబాద్ మండలంలోని సోమలింగేశ్వ ఆలయం, రామాలయం, మైలారం గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయంలో భక్తులు సత్యనారాయణ వ్రతాలు, ప్రత్యేక పూజలు చేశారు. తులసి పూజలు చేసి, దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. రాజంపేటలోని సాయిబాబ ఆలయంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నంను రాశిగా పోసి గోవర్ధన పర్వతాన్ని చేసి పూజ నిర్వహించారు. ఇస్కాన్ కామారెడ్డి శాఖ ఇన్‌చార్జి వెంకట వెంకటదాస్ ప్రభుజీ భక్తులకు భగవత్ గీత ప్రవచనాలు చేశారు. కట్లెకుంట్ల నరేందర్ ప్రవళిక దంపతులు అన్నదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విఠల చిన్న సిద్దిరాములు, వైస్ చైర్మన్ నవుబోతు శంకర్, సభ్యులు పటేల్ సత్యం రెడ్డి, బందం కృష్ణమూర్తి, కామిశెట్టి వీరన్న పటేల్, శ్రీరాం సురేశ్, అముదాల రమేశ్, రాజిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రాజంపేటలో అన్నంతో గోవర్ధన గిరి నమూనా

గేటు పెట్టనివ్వడం లేదని

మహిళ ఆత్మహత్యాయత్నం

రామారెడ్డి, నవంబర్ 15: ఇంటి ఎదుట గేటు పెట్టుకోనివ్వడం లేదని మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెటుకూరి సాయవ్వ కొత్తగా ఇల్లు నిర్మించుకుంటున్నది. ఇంటి ఎదుట గేటు పెట్టుకోకుండా చెటుకూరి చిన్న మల్లయ్య కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారు. దీంతో మనస్తాపం చెందిన సాయవ్వ శుక్రవారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే ఆమెను కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించామని కుటుంబీకులు తెలిపారు.

పోలీసులు, జీపీ సిబ్బంది సహకారంతో అంత్యక్రియలు

మద్నూర్, నవంబర్ 15: మండల కేంద్రానికి చెందిన బోయరాజు(45) గురువారం రాత్రి మరణించాడు. మద్యం తాగి లక్ష్మమ్మ ఆలయం వద్ద నిద్రించిన ఆయన నిద్రలోనే మృతిచెందాడు. నారాయణఖేడ్ వాసి అయిన అతడు కొన్నేండ్ల క్రితం బతుకుదెరువు కోసం మద్నూర్‌కు వచ్చాడని ఎస్సై విజయ్ కొండ తెలిపారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా మృతుడికి పేద కుటుంబం కావడంతో పంచాయతీ సిబ్బంది, పోలీసులు కలిసి అంత్యక్రియలు నిర్వహించారు.

రైతులను మోసం చేస్తున్న

రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

లింగంపేట, నవంబర్15: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి తరలించిన ధాన్యానికి తరుగు పేరిట మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. లింగంపేట మండలం నుండి మాచారెడ్డి మండలంలోని భవానీపేట గ్రామంలోని రైస్‌మిల్లుకు 702 బస్తాల ధాన్యం తరలిస్తే 696 బస్తాలు రాసిచ్చినట్లు తెలిపారు. 6 బస్తాలు తరుగు పేరిట కోత విధించారన్నారు. సదరు రైస్ మిల్లర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో ఆందోళన లు నిర్వహిస్తామని హెచ్చరించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి రూరల్/కామారెడ్డి రూరల్, నవంబర్ 15: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురు బాధితులకు వాటిని రికవరీ చేసి శుక్రవారం అందజేశామని ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడం పోలీసుల కర్తవ్యమని అన్నారు. ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే పూర్తి వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సీఐ ఈఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి అందజేస్తామని చెప్పారు. ఫోన్లను రికవరీ చేసి అందజేసిన ఎస్సైకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

కామారెడ్డి మండలం దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బీబీపేట్ మండలం ఉప్పర్‌పల్లికి చెందిన రాజు, దోమకొండ మండలం గొట్టిముక్కులకు చెందిన రాజు ఫోన్లు పోగొట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజు సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి మొబైల్ ఫోన్లను బాధితులకు శుక్రవారం అందజేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MARIKINDI ABHILASH, S/o. Nadpi Rajanna, H.No. 6-20/1, Pachalanadukuda, (M) Velpur, Dist. Nizamabad has Changed My Surname/Name as MARRIKINDI VENKATI.
NT-326716

CHANGE OF NAME

★I, MARIKINDI RADHA, W/o. Marrikindi Venkati, H.No. 6-20/1, Pachalanadukuda, (M) Velpur, Dist. Nizamabad, TG. has Changed My Surname/Name as MARRIKINDI JYOTHI.
NT-326716

CHANGE OF NAME

★I, MARIKINDI CHINNA VENKAT RAJAN, H.No. 6-2011, Parhalana Pachala Nadukuda, (M) Velpur, Nizamabad Dist., TG. has Changed My Surname/Name as MARRIKINDI NADPI RAJANNA.
NT-326716

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు మధ్యలో

ప్రమాదకరంగా గుంత

అదమరిస్తే అంతే..

బోర్లం – బోర్లం క్యాంపు తండా ప్రధాన రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంత

బాన్సువాడ రూరల్, నవంబర్ 15: మండలంలోని బోర్లం – బోర్లం క్యాంపు ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. లోతైన గుంత ఏర్పడడంతోపాటు అందులో నీరు నిలువడంతో వాహనదారులకు ఇబందులు తప్పడం లేదు. రోడ్డు మధ్యలో ఉన్న ఈ గుంతతో రాత్రి సమయంలో చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చి వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎల్లారెడ్డిలో మాలధారులకు నిత్య భిక్ష ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 15: ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో నిత్యభిక్షను ప్రారంభించారు. ప్రతి రోజూ మధ్యాహ్నం ఒంటి గంటకు అయ్యప్ప ఆలయ ఆవరణలో భిక్ష ఉంటుందని, జనవరి 8వ తేదీ వరకు కొనసాగుతుందని సేవా సమితి సభ్యులు శుక్రవారం తెలిపారు. భిక్ష ఏర్పాటుచేసేవారు, దాతలు సేవా సమితి సభ్యులను ముందుగా సంప్రదించాలని సూచించారు.

భిక్ష స్వీకరిస్తున్న మాలధారులు

పోల్కంపేటలో గోవు దారుణ హత్య

డాగ్‌స్క్వాడ్‌తో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

లింగంపేట, నవంబర్ 15: మండలంలోని పోల్కంపేట గ్రామంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గోవును గొడ్డలితో నరికి దారుణంగా హత మార్చారు. గ్రామానికి చెందిన చాకలి కాంతం తన ఆవును ఇంటి కట్టేశాడు. శుక్రవారం ఉదయం చూడగా అది రక్తపు మడుగులో చనిపోయి ఉన్నది. పోలీసులకు సమాచారం అందించగా.. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, స్థానిక ఏఎస్సై ప్రకాశ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టగా.. అది గోవును చంపిన ప్రదేశం నుంచి గ్రామ శివారులోకి వెళ్లి ఆగిపోయింది. ఆవు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.